సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 30 । మార్చి । 2025



ఉప సర్పంచ్ పదవి కోసం అరాచకం

ఉపసర్పంచ్ పదవి కోసం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలకు, దౌర్జన్యానికి, అరాచకాలకు పాల్పడ్డారని రాచమల్లు తెలిపారు. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది॥ (సా॥)
కడప	: 6.31
పులివెందుల	: 6.33
ప్రొద్దుటూరు	: 6.32

గరిష్టం/కనిష్టం
40.2 /23.6

వాతావరణం

జిల్లాలో శనివారం 23.6 – 40.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు



కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జిల్లా ప్రజలకు విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. షడ్రుచుల సమ్మేళనం ఉగాది పండని పేర్కొన్నారు. ఈ ఏడాదంతా జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతన్నల ఇంట సిరులు కురవాలని, అలాగే అన్ని వర్గాల ప్రలకు మేలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

ఐదుగురికి ఉగాది పురస్కారాలు

కడప కల్చరల్: ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక విభాగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత హంస (కళారత్న) పురస్కారాలను విశ్వావసు నామ సంవవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం అందజేయనుంది. వైఎస్సార్ కడప జిల్లా నుంచి ఈ పురస్కారానికి ఐదుగురు ఎంపికయ్యారు. వారిలో నాటకానికి సంబంధించి కడప నగరం ఓం శాంతినగర్‌లోని సింగంశెట్టి అరుణకుమారి హంస (కళారత్న) పురస్కారం , సాహిత్య విభాగం నుంచి విద్వాన్ గానుగ పెంట హనుమంతరావు (బద్వేలు), ప్రొద్దుటూరుకు చెందిన జింకా సుబ్రమణ్యం, కడప నగరం బ్రౌన్ గ్రంథాలయ సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని మొగిలిచెండు సురేష్ ఉగాది పురాస్కరాలకు ఎంపికైనట్లు ఆ విభాగానికి చెందిన అధికారులు శనివారం జాబితాను ప్రకటించారు.

నేడు, రేపు రిజిస్ట్రేషన్ సేవలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రధాన పండుగలైన ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా ఈనెల 30, 31 తేదీల్లో సెలవు రోజులయినప్పటికీ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేస్తాయని రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ ప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. భూములు, స్థలాల క్రయ విక్రయదారులు ఈ విషయాన్ని గుర్తించి తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

కడప కార్పొరేషన్ : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈ నెల 30, 31వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగంలో నియామకాలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగ అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. బద్వేల్ ఎంప్లాయిస్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా సింగనమల శ్రీనివాసుల రెడ్డి, జమ్మలమడుగు అధ్యక్షుడిగా మల్లు వెంకట స్వామిరెడ్డి, కడప అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ ఖాదర్, మైదుకూరు అధ్యక్షుడిగా సింగా వీరభద్రుడు, ప్రొద్దుటూరు అధ్యక్షుడిగా లక్కిరెడ్డి వెంకట రమణారెడ్డి, పులివెందుల అధ్యక్షుడిగా బి. వీరారెడ్డి నియమితులయ్యారు.

72 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్ : పదో తరగతి పరీక్షల ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–1లో భాగంగా శనివారం జరిగిన సంస్కృతం, అరబిక్, పర్షియన్‌తోపాటు ఒకేషనల్ పరీక్షలకు 72 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 45 పరీక్షా కేంద్రాలకు గాను రెగ్యులర్‌కు సంబంధించి 3915 మంది విద్యార్థులకుగాను 3843 మంది విద్యార్థులు హాజరుకాగా 72 మంది గైర్హారయ్యారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ 9 పరీక్షా కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ 39 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయని డీఈఓ తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పన్ను చెల్లింపుదారులు జీఎస్టీ, వీఏటీ/సీఎస్టీ పన్నులు సకాలంలో చెల్లించాలని వాణిజ్యపన్నులశాఖ జాయింట్ కమిషనర్ కల్పన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నులు చెల్లింపునకు ఆన్‌లైన్ ద్వారా 24 గంటలపాటు వెబ్‌సైట్ సౌకర్యం ఉందని, వెబ్‌సైట్‌లో ఈ–పేమెంట్ గేట్‌వే ద్వారా పన్నులు సులభంగా చెల్లించవచ్చని పేర్కొన్నారు. అలాగే అసిస్టెంట్ కమిషనర్లు, జాయింట్ కమిషనర్ కార్యాలయాల్లో పన్ను చెల్లింపుదారులకు అవసరమైన సహాయ సహకారాలు, సందేహాల నివృత్తి కోసం సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు తమశాఖకు తమవంతుగా సహకరించాలని కోరారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు పిలుపు

- నిరుపేద కుటుంబాల బాలికలకు సదవకాశం
- ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అవకాశం
- ఏప్రిల్ 11 దరఖాస్తుకు తుది గడువు
- 17 కేజీబీవీల్లో భర్తీకానున్న 1602 సీట్లు

గ్రామీణ ప్రాంత నిరుపేద కుటుంబాల బాలికల చదువుకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) బాసటగా నిలుస్తున్నాయి. ఉచిత వసతితోపాటు నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ ఆదరిస్తున్నాయి. బాలికల ఉజ్వల భవిష్యత్తుకు గట్టిపునాది వేస్తున్నాయి. తాజాగా కేజీబీవీల్లో 6వ తరగతితోపాటు ఇంటర్ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసిన నేపథ్యంలో ప్రత్యేక కథనం.





సింహాద్రిపురం కేజీబీవీ (ఇన్‌సెట్) కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో బాలికల అక్షరాస్యత శాతాన్ని పెంచాలన్న సదాశయంతో బాలికల అక్షరాస్యత తక్కువగా ఉన్న మండలాల పరిధిలో ప్రభుత్వం కేజీబీవీలను ఏర్పాటు చేసింది. ఈ కేజీబీవీలు మొదట్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉండేది. 10వ తరగతి తరువాత విద్యార్థులు చదువుకు దూరమవుతున్నట్లు తెలియడంతో మళ్లీ ఇంటర్మీడియట్‌ను ప్రవేశపెట్టారు. 2024–25వ విద్యా సంవత్సరానికి సంబంధించి 17 కేజీబీవీల్లో 6వ తరగతిలో 680, ఇంటర్మీడియట్‌లో 680 సీట్లను భర్తీ చేయనున్నారు. అలాగే 7వ తరగతిలో ఖాళీగా ఉన్న 23 సీట్లు, 8వ తరగతిలో ఖాళీగా 13 సీట్లు, 9వ తరగతిలో 14 సీట్లు, 10వ తరగతిలో 29 సీట్లు, 12వ తరగతిలో 163 సీట్లు ఇలా మొత్తంగా అన్ని కలిపి 1602 సీట్లు భర్తీ కానున్నాయి.

అర్హులెవరంటే..

బడిబయటి పిల్లలు, బడి మానేసిన పిల్లలు, అంగవైకల్యం, అనాథలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలకు తొలి ప్రాధాన్యతగా సీట్లు కేటాయిస్తారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తారు. ఎంపికైన బాలికలకు ఫోన్‌కు మేసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. లేదంటే సంబంధింత కేజీబీవీ నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు.

అడ్మిషన్ల కోసం...

విద్యార్థిని తల్లి, తండ్రిలకు సంబంధించిన ఆధార్ కార్డు, తల్లిదండ్రులు లేకుంటే సంరక్షకుల ఆధార్‌కార్డు, విద్యార్థినికి సంబంధించి 3 పాస్‌పోర్టు సైజు ఫోటోలు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, మొబైల్ నెంబర్‌ను ఇవ్వాల్సి ఉంది.ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ ఈనెల 22 నుంచి ప్రారంభమైంది. ఏప్రిల్ 11వ తేదీ వరకు గడువు విధించారు.

ఏవైనా సమస్యలు సందేహాలు ఉంటే 7075159996, 7075039990 నంబర్లలో సంప్రదించవచ్చు.

జిల్లాలో ఇంటర్ ఉన్న కేజీబీవీల వివరాలు

జిల్లాలో అట్లూరు, చాపాడు, దువ్వూరు, పెద్దముడియం, పోరుమామిళ్ల, ఎస్‌ఏ కాశినాయన, సింహాద్రిపురం కేజీబీవీలలో ఎంపీసీ గ్రూపు ఉండగా, బి.కోడూరు, బిమఠం, చక్రాయపేట, ఖాజీపేట, మైదుకూరు, పెండ్లిమర్రి, వల్లూరు, వేముల కేజీబీవీల్లో బైపీసీ, కలసపాడు కేజీబీవీలో హెచ్‌ఈసీ, జమల్మమడుగు కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులు ఉన్నాయి.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేజీబీవీల్లో 6, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. ఇందుకు సంబంధించి అర్హత ఉన్న బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. ఇందులో సీటు పొందిన వారికి ఉచిత విద్యతో పాటు భోజన, వసతి కూడా ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యావంతులు కావాలి.

– అనిత, జీసీడీఓ, కేజీబీవీ స్కూల్స్.

అత్యుత్తమ బోధన



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో రూపాయి ఖర్చులేకుండా నిరుపేద బాలికలకు అత్యుత్తమ బోధన అందుతుంది. దీంతోపాటు నాణ్యమైన పోషక విలువలతో కూడిన భోజనం వసతి సదుపాయం అందుబాటలో ఉంది. అలాగే బాలికలకు భద్రత కూడా ఉంటుంది. అర్హత కలిగిన బాలికలు httpr://apkfbva.a pcfrr.in నందు దరఖాస్తు చేసుకోవాలి.

– నిత్యానందరాజులు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి.

నిబంధనల మేరకు ప్రవేశాలు



కేజీబీవీల్లో ప్రభుత్వ నిబంధనల మేరకే ప్రవేశాలు కల్పిస్తాం. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు తొలి ప్రాధాన్యమిస్తాం. పేద కుటుంబాల బాలికలకు కేజీబీవీలు ఆసరాగా నిలుస్తున్నాయి, అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి.

– షేక్ షంషుద్దీన్, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి

- పరీక్షల విధుల్లో ఉన్న ఉపాధ్యాయులను వేధించడం తగదు
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



కడప కార్పొరేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అయినప్పటికీ ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు సంబంధించిన 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ఇంకా ఏర్పాటు చేయకపోవడం సరికాదని విమర్శించారు. వెంటనే కమిషన్ ఏర్పాటు చేసి, కొత్త పి.ఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆలోపు ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఐఆర్ ను 25% తగ్గకుండా ప్రకటించాలని కోరారు. ఉద్యోగులకు 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్.ఎస్.సి. పరీక్షలలో రాష్ట్ర వ్యాప్తంగా సస్పెండ్ చేసిన ఉపాధ్యాయులను తిరిగి విధులలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎవరో చేసిన తప్పులకు ఉపాధ్యాయులను బలి చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం, వల్లూరు, వేంపల్లె (వైఎస్సార్ జిల్లా) ఇతర ప్రాంతాలలో ఎవరో చేసిన తప్పులకు ఉపాధ్యాయులు బలి అయ్యారన్నారు. ప్రభుత్వం అసలైన దోషలను శిక్షించాలే కాని, ఉపాధ్యాయులను సస్పెండ్ చేసి జైలుకు పంపడం సరియైన పద్ధతి కాదన్నారు. రాబోవు పరీక్షలకైనా ఇలాంటి తప్పిదాలు ఎక్కడా జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు బలిజపల్లె గంగమ్మ జాతరకు అంకురార్పణ

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో విశిష్టత సంతరించుకున్న బలిజపల్లె గంగమ్మ జాతర నిర్వహణకు ఆదివారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా గంగమ్మ స్వయంభు వద్ద గంటకు పైగా పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. వేలాది మంది భక్తులు అంకురార్పణ వేడుకలో పాల్గొననున్నారు. ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఏప్రిల్ 1న జాతర జరగనుంది.

నేడు అగ్రహారంలో అంకాళమ్మకు పొంగళ్లు

మండలంలోని తుమ్మల అగ్రహారం బలిజపల్లె గంగమ్మకు పుట్టినిల్లు. అందువల్ల బలిజపల్లె గంగమ్మ జాతరకు ఆదివారం అంకురార్పణ చేసే సమయంలో తుమ్మల అగ్రహారంలో వెలిసిన అంకాలమ్మకు ఆ గ్రామ ప్రజలు పొంగళ్లు పెట్టనున్నారు.



బలిజపల్లెలో వెలసిన గంగమ్మ స్వయంభు

కొత్త ఉషస్సుల విశ్వావసు



- రుచి తెలిపే పండుగ
- నేడు ఉగాది





ప్రజలతో కళకళలాడుతున్న కడప–మద్రాస్ రోడ్డు



పాత వన్ టౌన్ వద్ద ఉగాది పూజ సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం

కడప కల్చరల్ : విశ్వావసు నామ నూతన సంవత్సరాదికి తెలుగు లోగిళ్లు నవ శోభను సంతరించుకున్నాయి. పండగ సామగ్రి కొనడానికి వచ్చిన ప్రజలతో శనివారం మార్కెట్లు కళకళలాడాయి. ప్రజలు ఉదాయన్నే తలంటుస్నానాలు చేసి ఇంటి దైవానికి పూజలు నిర్వహిస్తారు. ఇంటిల్లిపాది షడ్రుచుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చడిని సేవిస్తారు. సాయంత్రం దేవాలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుంటారు. ఆయా దేవాలయాలు ముస్తాబయ్యాయి.

జీవితం రుచి తెలిపే పండుగ

జీవితాంతం హాయిగా..ఎలాంటి కష్టాలు లేకుండా సాగిపోవాలని అందరూ కోరుకుంటారు. ఎంత వద్దనుకున్నా..ఎంత ధనవంతులకైనా కష్టాలు తప్పవు....జీవితమంటే కష్టసుఖాల కలయిక అని తెలుపుతూ ఉగాది నాడు షడ్రుచులతో ఉగాది పచ్చడి స్వీకరిస్తా రు. జీవితమంటే చేదు, తీపిల కలయిక అని సందేశం ఇవ్వడమే కాకుండా శరీరానికి ఆరోగ్యం చేకూర్చే ఉగాది పచ్చడిని ప్రతి తెలుగింటిలోనూ తప్పక తయారు చేస్తారు. ఈ సీజన్‌లో వచ్చే ఎన్నో వ్యాధులను ఈ పచ్చడి తినడం ద్వారా నివారించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.

కవుల పండుగ

ఉగాదిని కవుల పండుగగా చెప్పవచ్చు. పండుగ నాడు కవి సమ్మేళనాలు నిర్వహించి అంతో ఇంతో సంభావన ఇచ్చి కవులను సత్కరించడం పండుగ సంప్రదాయం. వైఎస్సార్ జిల్లాను కవుల గడపగా పేర్కొంటారు. జిల్లా అంతటా స్వచ్ఛంద సేవా సంస్థలు, సమాజానికి సేవ చేస్తున్న వారికి ఉగాది పురస్కారాలు అందజేస్తుండగా, సాహిత్య సంస్థలు కవులను ఆహ్వానించి కవి సమ్మేళనాలు నిర్వహించి వారిని ఘనంగా సత్కరించనున్నారు.

మత సామరస్యానికి ప్రతీక

మన జిల్లాను మత సామరస్యానికి మారుపేరుగా పేర్కొంటారు. మొన్నటి ముస్లిం ప్రముఖులు హకీమ్ మంజుమియా నుంచి నేటి పెద్దదర్గా వరకు మత సహనానికి గట్టి పునాదులు వేశాయి. ఉగాది సందర్భంగా దేవునికడప ఆలయంలో పలువురు ముస్లింలు ప్రార్థనలు నిర్వహిస్తారు. ఒంటిమిట్ట, రాయచోటిలలో కూడా ఈ ఆచారం ఉంది. ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం వెలుపల నాటి ముస్లిం ప్రముఖులు తవ్వించిన ఇమామ్ బేగ్ బావి మత సామరస్యానికి మారుపేరుగా నేటికీ నిలిచి ఉంది. కడప బ్రాహ్మణ వీధిలోని జూల ఆంజనేయస్వామి ఆలయాన్ని ముస్లిం సుల్తాన్ నిర్మింప జేసినట్లు తెలుస్తోంది.

అవినీతి మచ్చ లేని జీవితం మాది

- కాంట్రాక్టు వర్కులు చేసిన చరిత్ర మా కుటుంబానికి లేదు
- నా ప్రమేయం లేకుండానే వర్ధిని కన్‌స్ట్రక్షన్ రిజిస్ట్రేషన్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐఏఎస్‌ను కమిషనర్‌గా తెచ్చాం....
- మీరు మీ బంధువును కమిషనర్‌గా తెచ్చుకొని ఆటలాడుతున్నారు
- వాసు, మాధవిరెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన మేయర్ సురేష్ బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడప మేయర్ కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కాంట్రాక్టు వర్కులు చేసిన చరిత్ర తమ కుటుంబానికి లేదని కడప మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నోటీసులపై శనివారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడిది అని చెప్పున్న వర్ధిని కాంట్రాక్టు సంస్థను తనకు తెలియకుండానే రిజిస్ట్రేషన్ చేశారని, అది చేసిన మొత్తం వర్కులు కూడా రూ.30లక్షలలోపే అన్నారు. పనుల్లో ఎక్కడా అవినీతి జరిగినట్లుగానీ, నాణ్యతలో లోపాలున్నాయనిగానీ నోటీసుల్లో చెప్పలేదన్నారు. పనులు చేయకుండా బిల్లు లు చేసుకున్నట్లు కూడా ఎక్కడా లేదన్నారు. వర్క్ చేసే విధానంలో, కాంట్రాక్టర్ రిజిస్టర్ చేసే విధానంలో తప్పులున్నాయని చెప్తారన్నారు. రూ.10లక్షలు పైబడిన వర్కులు మాత్రమే తన దృష్టికి వస్తాయని, ఆలోపు వర్కులు కమిషనర్ స్థాయిలోనే జరుగుతాయని అందువల్ల ఈ కాంట్రాక్టు పనుల విషయం తనకు తెలియలేదన్నారు.

40 ఏళ్ల నుంచి తన పెదనాన్న, తాను, తన భార్య చిన్నచౌకు సర్పంచులుగా ఉన్నామని, 2001లో జెడ్పీ చైర్మన్‌గా, రెండు పర్యాయాలు మేయర్‌గా, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీల్లో 15 ఏళ్లు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశానని, ఎక్కడా చిన్న అవినీతి మచ్చ లేదన్నారు. వైఎస్సార్, వైఎస్ జగన్ ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో జిల్లాల్లో రూ.20 వేలకోట్ల అభివృద్ధి పనులు జరిగాయని, తాను చేయాలని అనుకుంటే వందలకోట్ల కాంట్రాక్టు పనులు చేసేవాడినన్నారు. రాజకీయాల్లోకి వచ్చాక తాము ఆస్తులు అమ్ముకున్నామే తప్పా, ఎక్కడా సంపాదించుకోలేదని స్పష్టం చేశారు. నిత్యం ప్రజాసేవలో ఉన్న తనపై నిందలు వేయడం బాధాకరమన్నారు.

ట్రెజరీలో భద్రపరచాల్సిన డాక్యుమెంట్లు వారి చేతికి ఎలా వచ్చాయి

2019లో ఎన్నికల్లో నామినేషన్ వేసిన డాక్యుమెంట్లను ట్రెజరీలో భద్రపరచాల్సి ఉండగా, వాటిని అధికారులతో బయటికి తీయించి, ఒరిజినల్స్ లేకపోయినా ఒక డీఈతో అటెస్టేషన్ చేయించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ఈనెల 28వ తేది సాయంత్రం నోటీసు తనకు అందిందని, ఐదు రోజుల ముందే ఆ నోటీసును ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసులరెడ్డి బహిర్గత పరచడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అన్నారు. 2019లో అఫిడవిట్‌లో చూపినప్పుడు తన కుమారుడు ఒక మైనర్ అని, ఇప్పుడతను మేజర్ అని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ దాచిన డాక్యుమెంట్లు వారి చేతికి ఎలా వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రాగానే అందరినీ భయపెట్టి రెండు బార్లను స్వాధీనం చేసుకున్నారని, అడ్డూ అదుపూ లేకుండా ఇసుక, మట్టి దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. మట్కా సైతం ఆడిస్తున్నారని విమర్శించారు.

వాసు అవినీతి ఎవరికి తెలీదు...

1995లో శ్రీ సాయి కన్‌స్ట్రక్షన్‌లో పార్టనర్‌గా ప్రవేశించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అవతవకలకు పాల్పడితే 2004లో ఈఎన్‌సీ శివారెడ్డి ఆ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆర్‌కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే ఇంజినీరింగ్ కాంట్రాక్టు సంస్థను కొని దొంగ సర్టిఫికెట్లు పెట్టి కాంట్రాక్టు సంస్థను ఎలా ప్రమోట్ చేసుకున్నారో, ఎంత నల్లధనం వెనకేశారో అందరికీ తెలుసన్నారు. 2014–19లో టీడీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో చేయాల్సిన నీరు–చెట్టు పనులను కడప నగరంలో చేసి...9 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆ బిల్లులను చేసుకునేందుకు ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. శ్రీనివాసులరెడ్డి కుమారుడిని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిని చేయాలని మెజార్టీ లేకపోయినా 8 మంది క్రికెట్ అసోసియేషన్ సభ్యులను బ్లాక్‌మెయిల్ చేసి 6 గంటలు ఇంట్లో నిర్బంధించి సంతకాలు చేయించుకున్నారని...ఇంత దౌర్జన్యం ఎక్కడా చూడలేదని విమర్శించారు. కడపను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక ఐఏఎస్ అధికారిని తెచ్చి పాలన చేశామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్ స్థాయిని తగ్గించి ఓ కేసులో ఉన్న వాళ్ల బంధువైన గ్రూప్–1 అధికారిని కమిషనర్‌గా తెచ్చుకొని ఆటలాడుతున్నారని ధ్వజమెత్తారు. వీళ్లా అవినీతి గురించి మాట్లాడేదని మండిపడ్డారు.

అధికారంలోకి వచ్చాక మాధవిరెడ్డి అక్రమాలకు లెక్కేలేదు

సంధ్యా సర్కిల్‌లో ఉన్న ఆర్ఎస్ఆర్ స్పైర్ మాల్‌లో 0.04 సెంట్లు ప్రభుత్వ భూమిని వాసు ఆక్రమణ చేశారని, దీనిపై కమిషనర్ నోటీసు ఇస్తే కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారన్నారు. మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి తన చెల్లికి పసుపు, కుంకుమ కింద ఇచ్చిన స్థలాన్ని కూడా ఆక్రమించేందుకు వారిని స్టేషన్‌కు పిలిపించి బెదిరించారన్నారు. ఈ 9 నెలల్లోనే ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసులరెడ్డి ఎన్నో అక్రమాలు చేశారని, 15వ ఆర్థిక సంఘం కింద చేపట్టే పనుల టెండర్లలో ఎవరూ పాల్గొనకుండా కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారన్నారు. నగరాన్ని అభివృద్ధి చేసేందుకు మాత్రం ప్రభుత్వం నుంచి ఒక్క పైసా నిధులు తేలేదని ఎద్దేవా చేశారు. తనకిచ్చిన నోటీసుపై ప్రభుత్వానికి వివరణ ఇస్తానని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు పాకా సురేష్, మగ్బూల్ బాషా, కె. బాబు, మల్లికార్జున, చంద్రహాసరెడ్డి, బాలస్వామిరెడ్డి, రామలక్ష్మన్‌రెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి, బసవరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా


ఎన్టీఆర్ వైద్య సేవా బిల్లులు విడుదల చేయాలి



వైద్య సేవా జిల్లా కో ఆర్డినేటర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న హాస్పిటల్స్ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించి ఎన్టీఆర్ వైద్య సేవా పథకం కింద పెండింగ్‌లో ఉన్న రూ.3 వేల కోట్లకు పైగా బిల్లులు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ కడప జిల్లా శాఖ ప్రతినిధుల బృందం డీఆర్వో, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆస్పత్రులు నిరంతర సేవలు అందించడంలో కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తక్షణ సాయంగా రూ.1500 కోట్ల నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే మిగిలిన బిల్లుల కోసం ఒక నిర్దిష్ట చెల్లింపు షెడ్యూల్ ప్రకటించాలని విన్నవించారు. ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకుంటే ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఆస్పత్రులు నిరాటంకంగా సేవలు అందించగలవన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, వివిధ ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే నేర నియంత్రణ



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : సమష్టి కృషితో నేరాలు నియంత్రించాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తెలిపారు. స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీస్ అధికారులతో నెల వారీ నేర సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, సైబర్ నేరాలు అరికట్టేందుకు ముమ్మరంగా దాడులు నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేసి అభినందించారు. సమావేశంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

• చంద్రకాంతిలో కలువ సోయగం

సాధారణంగా సూర్యకాంతిలో వికసించే అనేక పువ్వులు మనకు తెలుసు, రాత్రిపూట వికసించే కొన్ని పువ్వులు కూడా ఉన్నాయి. వింతలు, విశేషాలకు ప్రకృతి నెలవు. సిద్దవటంలోని అటవీశాఖ కార్యాలయంలో రాత్రిపూట చంద్రకాంతిలో కలువపువ్వు వికసించి అందరినీ అబ్బురపరిచింది. సాధారణంగా కలువ పూలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం లోపు వికసిస్తాయి. కానీ ముదురు ఎరుపు లేదా గులాబీ లేదా ఊదా రంగులో ఉండే ఈ నీటి కలువ.. శనివారం సాయంత్రం సంధ్యా సమయంలో వికసించింది. నీటిలో తేలియాడే ఈ అందమైన ప్రకాశవంతమైన పువ్వు చీకటి నేపథ్యంలో చాలా మర్మంగా కనిపిస్తుంది. 6 నెలల కిందట 8 రకాల కలువ పువ్వులను వివిధ ప్రదేశాల నుంచి తెప్పించి కార్యాలయం ఆవరణంలో మూడు తొట్లలో నాటామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. రాత్రి పూట వికసిస్తూ కనువిందు చేస్తోందని ఆమె చెప్పారు.

– సిద్దవటం



సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో చంద్రకాంతిలో వికసించిన కలువ పువ్వు

• ధూమపాన డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం క్షేమకరమని ప్రజలు భావించి, ఇష్టపడుతుంటారు. ఇటువంటి సందర్భంలో డ్రైవర్లు, కండెక్టర్లు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అయితే శనివారం తెల్లవారుజామున కడప నుంచి విజయవాడకు వెళ్తున్న బస్సులో.. డ్రైవర్ ఎ.రామమోహన్ విధి నిర్వహణలో ప్రయాణికుల భద్రతను విస్మరించి ధూమపానం చేయడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఇలా చేయడం సరికాదని పలువురు ప్రయాణికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ డ్రైవర్‌ను విజయవాడలో విధుల నుంచి తప్పించి సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు 'సాక్షి'కి తెలిపారు. బస్సును వేరే డ్రైవర్ సాయంతో కడపకు తీసుకొచ్చేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. భవిష్యత్తులో డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

– కడప కోటిరెడ్డిసర్కిల్



విధి నిర్వహణలో ధూమపానం చేస్తున్న డ్రైవర్

నేటి నుంచి పెద్ద పీరయ్య ఆరాధనోత్సవాలు



ముడుమాలలోని సిద్దయ్యమఠం

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రభోదకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ప్రథమ శిష్యుడు దూదేకుల సిద్దయ్యస్వామి పెద్ద కుమారుడు పెద్దపీరయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ముడుమాలలోని సిద్దయ్యమఠంలో ఏటా ఉగాది సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్నాయి. ఇందు కోసం ప్రస్తుత మఠాధిపతులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పెద్దపీరయ్యస్వామికి పూలపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. బి.మఠం మండలం గొడ్లవీడు గ్రామానికి చెందిన కనపర్తి నాగిరెడ్డి, కనపర్తి సిద్దారెడ్డిల జ్ఞాపకార్థం వారి కుమారులు రాత్రి గ్రామోత్సవం ఏర్పాటు చేస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. భజనలు, డ్రామాలు, చిన్నాయపల్లె గ్రామస్తుల ఆధ్వర్యంలో సినీ పాటకచేరి, కోలాటాలు వంటి కార్యక్రమాలు రాత్రి ఉత్సాహ భరితంగా జరుగుతాయి.

31న బండలాగుడు పోటీలు

31న (సోమవారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి బండలాగుడు పోటీలు ఉంటాయి. ప్రథమ బహుమతి జౌకుపల్లెకు చెందిన ముత్యాల పిచ్చిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జెడ్పీ చైర్మన్, బి.మఠం జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి రూ.1,00,116లు, రెండవ బహుమతి గొడ్లవీడు గ్రామం కనపర్తి రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు, సింగల్ విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి రూ.70,116లు, మూడవ బహుమతి ముడుమాల గ్రామం కొనకొండు ఆచారి కొండయ్య కుమారులు రూ.45,116లు, నాలుగో బహుమతి బసిరెడ్డి దుగ్గిరెడ్డి రూ.30,116లు, 5వ బహుమతి సిద్దయ్యమఠం నిర్వాహకులు రూ.15,116లు ప్రదానం చేయనున్నారు. 16 మనుముల గుండు ఎత్తిన వారికి ప్రథమ బహుమతి జౌకుపల్లె గ్రామస్తులు రూ.25,116, రూ.2,016, రూ.1,116, 13 మనుముల గుండు ఎత్తిన వారికి బహుమతులు ఇవ్వనున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి కూడా భక్తులు రానున్నారు.

వైఎస్ కుటుంబ సహకారంతోనే జెడ్పీ చైర్మన్ స్థాయికి..

• జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందరెడ్డి

చక్రాయపేట : వైఎస్ కుటుంబ సహకారంతోనే తాను జెడ్పీ చైర్మన్ స్థాయికి ఎదగానని జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశాక ఆయన కుటుంబ సభ్యులతో కలిసి గండి క్షేత్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, జెడ్పీటీసీ తాటిగొట్ల శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్ పూర్ణ కుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం రూ.2 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఎస్ఆర్ మంజూరు చేయాలని జెడ్పీ చైర్మన్‌కు ఆలయ చైర్మన్, జెడ్పీటీసీ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఏపీ ఆగ్రోస్ మాజీ అధ్యక్షుడు నందారపు చెన్నకృష్ణారెడ్డి, చక్రాయపేట, వీరపునాయునిపల్లె ఎంపీపీలు మాధవీ బాలకృష్ణ, రమణారెడ్డి, వేముల, కమలాపురం జెడ్పీటీసీలు బయపురెడ్డి, సుమిత్ర రాజశేఖరరెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు సంబటూరు ప్రసాదరెడ్డి, ఈశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, హరినాథ్, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గండిలో అంజన్నకు పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

'లోక్ అదాలత్' సేవలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్

కడప అర్బన్ : జిల్లాలోని ప్రజలు శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కడప శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవల చైర్మన్ స్వర్ణ ప్రసాద్ తెలిపారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ ఆధ్వర్యంలో కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో 'పారా లీగల్ వలంటీర్‌లు, పర్మినెంట్ లోక్ అదాలత్ ఉద్యోగులకు శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలు, సామర్థ్యం, పెంపుదల, శిక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్‌లు సంబంధిత జిల్లా ప్రధాన కార్యాలయంలో న్యాయసేవాసదన్ భవన సముదాయాలలో పని చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలిపోయిన కారు.. తప్పిన ప్రమాదం

ప్రొద్దుటూరు క్రైం: మండలంలోని తాళ్లమాపురం గ్రామ సమీపంలో కారు దగ్ధమైంది. తాళమాపురం గ్రామానికి చెందిన నాగార్జున శనివారం ఉదయం కారులో పొద్దుటూరుకు వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి పొద్దుటూరు నుంచి కారులో తాళ్లమాపురం గ్రామానికి బయలుదేరాడు. గ్రామ సమీపంలోకి రాగానే కారులోని ఏసీ లోంచి పొగలు వచ్చాయి. అప్రమత్తమైన నాగార్జున వెంటనే కారును ఆపి దిగిపోయాడు. అతను కారు దిగి పక్కకు వెళ్లిన క్షణాల్లోనే మంటలు వ్యాపించడంతో కారు పూర్తిగా కాలిపోయింది. నాగార్జున అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు.

ఎవరికి వారే!

• తమ్ముళ్ల మధ్య కుదరని సఖ్యత
• టీడీపీలో కలగా మారిన ఐక్యత



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి



12వ డివిజన్‌లో టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న లక్ష్మీరెడ్డి, శివకొండారెడ్డి తదితరులు

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీలో తమ్ముళ్ల మధ్య కలహాల సెగలు తగ్గడం లేదు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలోకి వచ్చినా తీరు మారలేదు. 'తాము చెప్పిందే జరగాలనేది ఒకరు. మేము కూడా పార్టీని అంటి పెట్టుకొని ఉన్నాం. మేము కూడా సీనియర్లమే. మీ పెత్తనం ఏంటని మరొకరు'.. ఇలా పదవులు, పనుల వద్ద పోటీలు పడి వర్గాలుగా విడిపోయారు. తమ్ముళ్ల తగువు తీర్చడం అధిష్టానానికి కూడా పెద్ద తల నొప్పిగా మారింది. కడప నగరంలో శనివారం 43వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున.. మరోమారు తమ్ముళ్ల మధ్య ఉన్న వర్గపోరు బయట పడింది. కడప నగరం ఎన్టీఆర్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహనికి ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మరో వైపు అదే సమయానికి 12వ డివిజన్ సానపురెడ్డి హరినారాయణరెడ్డి కాలనీలో రాష్ట్ర వాణిజ్య సెల్ ప్రధాన కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి, అమీర్‌బాబు, కడప నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి పాల్గొన్నారు. అమీర్‌బాబు మాత్రం ఎన్టీఆర్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అలా వెళ్లి.. ఇలా వచ్చేశారు. పార్టీకి చెందిన మిగతా నేతలు అక్కడి వారు ఇక్కడికి రాలేదు.. ఇక్కడి వారు అక్కడికి వెళ్లలేదు. ఇలా ఎవరికి వారే అన్న చందంగా పార్టీ ఆవిర్భావ వేడుకలను కానిచ్చేశారు. కడప నగర టీడీపీలో ఎప్పటి నుంచో తమ్ముళ్ల మధ్య బహిరంగంగా లేదా పరోక్షంగా వర్గ పోరు సాగుతూనే ఉంది. దీంతో నేతల మధ్య ఐక్యత కలగానే మారిందని ఆ పార్టీలో చర్చ సాగుతోంది.

బైకును ఢీకొన్న కారు.. దంపతులు మృతి

కొండాపురం : మండల కేంద్రంలోని తాడిపత్రి–కడప జాతీయ రహదారిలో శనివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో దంపతులు మృతి చెందారు. ఎస్ఐ విద్యాసాగర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపురం మండలంలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన తూర్పింటి రామ్మోహన్(45), సరోజ(40) దంపతులు పాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. కొండాపురం నుంచి వారు తెల్లవారుజామున తాడిపత్రి వైపు ముచ్చుమర్రి గ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. కొండాపురంలోని జాతీయ రహదారిలో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే 108 వాహనంలో తాడిపత్రిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సరోజను వైద్యుడు పరిశీలించి మృతి చెందినట్లు తలిపారు. రామ్మోహన్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్యాభర్తలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు దుఃఖ సాగరంలో మునిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సరోజ మృతదేహం



మృతి చెందిన రామ్మోహన్



మాపై అసత్య ఆరోపణలు

ఈనాడు కథనంపై ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఖండన



పోరుమామిళ్ల : ఈనాడు దినపత్రికలో శనివారం ప్రచురించిన కథనంపై ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తీవ్రంగా స్పందించారు. 'గోవింద.. ఇదీ నీ బామ్మర్ది భూదందా!' శీర్షికతో ఈనాడులో వచ్చిన కథనంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు ఇద్దరు బామ్మర్దులు ఉండగా.. ఒకరు శంకర్‌రెడ్డి ప్రమాదంలో మరణించారని, మరొకరు వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆయనకు భూదందాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తనకు, తన బామ్మర్ది వెంకట్రామిరెడ్డికి ఎలాంటి సంబంధం లేని వార్త వండి వైఎస్సార్‌సీపీకి, మాకు అంటగట్టడం కరెక్టు కాదన్నారు. తమపై చేసిన ఆరోపణలు అసత్యమని తెలిపారు. ఎవరైనా అక్రమాలు, కబ్జాలకు పాల్పడినపుడు చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అడ్డు చెప్పబోమన్నారు. వాస్తవాలు తెలుసుకొని వార్తలు రాయాలని, ఇలా అడ్డదిడ్డంగా వార్తలు రాసి ఈనాడు పరువు దిగజార్చుకోవద్దని ఆయన సూచించారు.


కాంగ్రెస్ పార్టీని వీడుతున్న నాయకులు

• పీసీసీ అధ్యక్షురాలి తీరు నచ్చక దూరమవుతున్న నేతలు
• నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ రాజీనామా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఒక వెలుగు వెలిగిన కాంగ్రెస్ పార్టీ.. ఆయన మరణానంతరం జిల్లాలో కూడా ప్రాభవం కోల్పోయింది. సార్వత్రిక ఎన్నికల వేళ పీసీసీ అధ్యక్షురాలి పదవి చేపట్టిన షర్మిలా జిల్లాలో తూతూమంత్రంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి.. అనంతరం కనిపించిన దాఖలాలు లేవు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరికి వారే అనే విధంగా ఉంటూ వచ్చారు. కడప అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడి పోయిన అఫ్జల్‌ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడిగా నియమించారు. డీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న విజయజ్యోతి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడి మధ్య విభేదాలు తలెత్తాయి. డీసీసీ అధ్యక్షురాలు పార్టీ కార్యాలయంలో నిర్వహించే ఏ కార్యక్రమానికి ఆహ్వానించకపోవడంతో వాగ్వాదాలు జరిగాయి. దీంతో అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లాయి. పని చేసే వారిని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా గుర్తించడం లేదని ఆ పార్టీ నాయకులు రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది నాయకులు పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి అఫ్జల్‌ఖాన్ రాజీనామా చేశారు. పీసీసీ అధ్యక్షురాలు తీరు నచ్చకనే నాయకులు దూరమవుతున్నారని ఆ పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉప సర్పంచ్ పదవి కోసం అరాచకం

ఎమ్మెల్యే వరదపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కేవలం గోపవరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ పదవి కోసం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలు, దౌర్జన్యం, అరాచకాలకు పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. గోపవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం, శుక్రవారం జరిగిన సంఘటనలే ఇందుకు సాక్ష్యమని అన్నారు. ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా గురువారం తమ వార్డు సభ్యులను కార్యాలయంలోకి వెళ్లకుండా రాళ్లు విసిరి, మారణాయుధాలతో వెంబడించారన్నారు. శుక్రవారం టీడీపీ వార్డు సభ్యులు తమలో తాము కొట్టుకోవడం, కుర్చీలు విసిరేయడం, మినిట్స్ బుక్ చించడం జరిగిందన్నారు. ఫైనల్‌గా ఎన్నికల అధికారి రామాంజనేయరెడ్డికి గుండెపోటు వచ్చినట్లు నటింపజేశారన్నారు. గుండెపోటు వచ్చిన రామాంజనేయరెడ్డికి సంబంధించి అధికారులు ఎందుకు హెల్త్ బులెటిన్ విడుదల చేయలేదని ప్రశ్నించారు. ఇదంతా వరద స్టంట్ అని విమర్శించారు.

టీడీపీకి ఒకరే వార్డు సభ్యుడు

గత ఎన్నికల సందర్భంగా గోపవరం గ్రామ పంచాయతీలో 20 మంది వార్డు మెంబర్లకుగాను ఒకరే టీడీపీ తరఫున ఎన్నికయ్యారని రాచమల్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం మరో ఐదుగురు వైఎస్సార్‌సీపీ నుంచి వరద వైపు వెళ్లారన్నారు. ఏవిధంగా చూసినా 14 మంది వార్డు సభ్యులు ఉన్న వైఎస్సార్‌సీపీకి ఉప సర్పంచ్ పదవి దక్కుతుందా.. ఆరుగురు ఉన్న టీడీపీ సభ్యులకు దక్కుతుందా అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలన్నారు. రూ.3–4 లక్షలు ఇస్తామని ప్రలోభపెట్టినా తమ వార్డు సభ్యులెవరూ వరద వైపు వెళ్లలేదన్నారు. జరిగిన గొడవను బట్టి ఇలాంటి వరదరాజులరెడ్డిని ఎమ్మెల్యేగా తాము గెలిపించామా అని ప్రజలు విస్తుపోతున్నారన్నారు. తాను డబ్బు సంపాదించి ఇంటిలో పెట్టుకుంటున్నానని చెప్పిన ఎమ్మెల్యే, ఆయన కుమారుడు సంపాదిస్తున్న డబ్బును గూట్లో పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 1980 నుంచి రాజకీయాల్లో ఉన్నా నేటికీ ఆయనలో ఏమాత్రం మార్పు రాలేదని తెలిపారు. ఫ్యాక్షనిజాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా పోలీసు కేసులు నమోదు కాలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, రాజుపాళెం మండలం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాణ కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.